క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న మెప్మా సిబ్బంది

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వనిధి, స్వభియాన్, పక్వాడ రుణాలపై పట్టణంలోని వీధి వ్యాపారులకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సిబ్బంది ఆదివారం అవగాహన కల్పించారు.ఈ పథకాల ద్వారా రుణాల కోసం ముందుగా వీధి వ్యాపారులు డిజిటల్ యాక్టివేషన్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు సూచించారు. పీఎం స్వనిధి యాప్ ఇన్‌స్టాల్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్లు, డిజిటల్ అగ్రికేటర్స్ పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి మంత్రి సుభాష్ పూజలు

అమలాపురం టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో గల శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఉదయం సందర్శించారు. ఆలయంలో చేపట్టిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మంత్రి చేత పలు పండ్ల రసాలు, ద్రవ్యాలతో అభిషేకాలు చేయించారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందిస్తున్న కేశవకుమార్

అమలాపురం టౌన్: డీఎస్సీ 1998 బ్యాచ్ మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆ ఉపాధ్యాయుల ఫెడరేషన్ ప్రతినిధులు రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతి పత్రం అందించారు. అమలాపురంలో మంత్రి సుభాష్‌ను రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు సీహెచ్ కేశవకుమార్ కలిసి ఈ మేరకు వినతి అందించి ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. రెగ్యులర్‌తో పాటు 62 సంవత్సరాలకు పదవీ విరమణ చేసే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఫెడరేషన్ ప్రతినిధులు కడలి నాగరాజు, బొంతు శ్రీనివాస్, గుత్తుల వెంకటేశ్వరావు, దొమ్మేటి నాగేశ్వరరావు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

సర్పంచ్‌కు సత్కారం



సర్పంచ్ ఊర్మిళాదేవి దంపతులను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

ఉప్పలగుప్తం: సమనస శ్రీరామ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్తిక వనభోజన కార్యక్రమంలో విలసవిల్లి పంచాయతీ సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ దంపతులను పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీగణేష్ ఆదివారం ఘనంగా సత్కరించారు. విలసవిల్లి గ్రామం నుంచి సమనసకు వెళ్లే దారిలో బాలయోగి వారధి వద్ద రూ.18 లక్షల నిధులతో సీసీ రోడ్డును ఏర్పాటు చేయడం వెనుక సర్పంచి కృషిని కొనియాడారు. ఆమె సేవలను అభినందిస్తూ జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

అల్లవరం: కొమరగిరిపట్నంలోని బాలా త్రిపుర సుందరీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని ఆదివారం లక్ష బిల్వార్చనను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



తాళ్లరేవు: పోలేకుర్రు–పి.మల్లవరం రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుప్పాల శ్రవణ్‌కుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు పోలేకుర్రు గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ బైక్‌పై పి.మల్లవరంలోని ఓ హోటల్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా పోలేరమ్మ ఆలయ సమీపంలో తోటపేట గ్రామానికి చెందిన సాయి సిద్ధార్థ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రవణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన తాళ్లరేవు సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోరంగి ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె భారం భరించలేం..!

- అదనపు పెంపు యోచనపై లీజుదారుల ఆవేదన
- 33.33 శాతం పెంపునకు అదనంగా 18 శాతం జీఎస్టీ
- చిరు వ్యాపారులకు శరాఘాతం



అమలాపురంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ కాంప్లెక్స్



మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న లీజుదారుల అసోసియేషన్ ప్రతినిధులు(ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీకి 103 షాపులు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇవ్వడం ద్వారా మున్సిపాలిటీ ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇంత వరకూ బాగానే ఉన్నా మున్సిపల్ షాపులను అద్దెకు తీసుకుని వ్యాపారాలు చేస్తున్న లీజుదారులు గత మూడు నెలలగా అద్దెల పెంపుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్రతి షాపుపై మూడేళ్లకోసారి 33.33 శాతం అద్దె పెంపు, 18 శాతం జీఎస్టీ విధించడం సాధారణం. అయితే షాపుల్లో కొందరు లీజు ఎక్కువైందనో, ఇతర కారణాల వల్లో మధ్యలో షాపులను వదిలేస్తే అలాంటి షాపులకు మున్సిపాలిటీ మళ్లీ వేలంపాట నిర్వహిస్తుంది. వీటిపై మళ్లీ అదనంగా 33.33 శాతం పెంపు, జీఎస్టీ 18 శాతం పెంచి అద్దెకు ఇవ్వడంపై మిగిలిన లీజుదారుల్లో అలజడి మొదలైంది.

మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో పొట్టి శ్రీరాములు షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్) ప్రధానమైనది. గడియారం స్తంభం సెంటర్‌కి సమీపంలో 55 షాపులతో విస్తరించి ఉన్న పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ ఇది. ఆ షాపుల లీజుదారుల అసోసియేషన్ ప్రతినిధుల బృందం మున్సిపాలిటీ అద్దె పెంచవద్దంటూ కొన్ని నెలలుగా స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌లను కలిసి వినతి పత్రాలు అందించారు. తాము మూడేళ్లకోసారి పెంచే 33.33 శాతం పెంపు, 18 శాతం జీఎస్టీ విధింపునకు కట్టుబడి అద్దెలు చెల్లిస్తామని అయితే మధ్యలో వదిలేసిన షాపులకు వేలం పాటలు పెట్టి అధికంగా అద్దెలు నిర్ణయిస్తే తాము అంత అద్దెలు చెల్లించలేమని విన్నవించుకుంటున్నారు.

మూడు ఆప్షన్లతో ముందుకు

మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం మూడు ఆప్షన్లతో ముందుకు వెళుతోంది. మూడేళ్లకోసారి 33.33 శాతం పెంపు, 18 శాతం జీఎస్టీ విధింపు మొదటి ఆప్షన్. మార్కెట్ విలువను బట్టి అదనంగా 10 శాతం అద్దె పంచాలన్నది రెండో ఆప్షన్. ఇతర ప్రైవేటు భవనాలకు చెల్లిస్తున్న అద్దెలను పరిగణనలోకి తీసుకుని అద్దెలు పెంచాలన్నది మూడో ఆప్షన్. ఈ మూడింటిలో ఏది ఎక్కువ సూచిస్తుంటే దాని ప్రకారం అద్దెలు పెంచేందుకు మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం రెడీ అవుతోంది.

నిబంధనలు అమలు చేస్తే తమ అద్దెలు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని లీజుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అద్దెలు చెల్లించలేక ఖాళీ అయిన షాపులకు మధ్యలో వేలం పాటలు నిర్వహించి అద్దెలు నిర్ధారించినప్పటికీ మున్సిపాలిటీకి వారు అద్దెలు సక్రమంగా చెల్లించలేకపోతున్నారని మున్సిపల్ అధికారులు చెప్పడం గమనార్హం. మున్సిపాలిటీ పరిధిలో గల 103 షాపులకు గాను మొత్తం అద్దెల డిమాండ్ రూ.95 లక్షలు అయితే ఇప్పటి దాకా రూ.48 లక్షలు మాత్రమే వసూలు అయింది.

కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం

మున్సిపల్ రెవెన్యూ విభాగం సూచించిన మూడు ఆప్షన్లలో హెచ్చు ప్రాతిపదికన ఒక ఆప్షన్ అమలు చేస్తాం. తొలుత ఈ నిర్ణయాన్ని కౌన్సిల్ అజెండాలో పెడతాం. కౌన్సిల్ ఆమోదం ఎలా జరిగితే రెవెన్యూ విభాగం అలా చర్యలు చేపడుతుంది. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల లీజుదారులు పాత పద్ధతిలోనే అద్దెలు పెంచాలని మార్కెట్ వేల్యూ, ప్రైవేటు భవనాల అద్దెలను ప్రాతిపదికగా తీసుకోవద్దని అభ్యర్థిస్తున్నారు. ఈ అంశాన్ని సైతం కౌన్సిల్ సమావేశం నిర్ణయించాల్సి ఉంది.

– భూపతి శ్రీలక్ష్మి, రెవెన్యూ అధికారిణి, అమలాపురం మున్సిపాలిటీ.

వేతన సవరణపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అజయ్‌కుమార్

ముమ్మిడివరం: జీఓ నెంబర్ 36 ప్రకారం వేతన సవరణ చేయాలని సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో ఆదివారం జిల్లా సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన జిల్లా మహాజన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2019 తరువాత నియమించిన సిబ్బందిని కొనసాగించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరామయ్య మాట్లాడుతూ ఉద్యోగులు హెల్త్ కార్డులకు డీసీసీబీ వాటా కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా సహకార ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసినా గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఉద్యోగుల వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు నూకల బలరామ్, సీహెచ్ వెంకటేశ్వరరావు, కుంపట్ల అయ్యప్ప నాయుడు, మట్టపర్తి జయరాం, ఉద్యోగులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ



వీరేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజలో భక్తులు

తాళ్లరేవు: స్థానిక కేశవపురం గ్రామంలో వేంచేసియున్న భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో లక్షపత్రి పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి శివరామ కృష్ణ నేతృత్వంలో వేద పండితుల పర్యవేక్షణలో 16 మంది దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతిపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరిపించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమాల్లో శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడిని పరిష్కరించండి



ఎమ్మెల్యే అశోక్‌తో సమావేశమైన రైతులు

యానాం: ధాళ్వాపంటకు సాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని కోరుతూ ఆదివారం దరియాలతిప్ప ఆయకట్టు రైతాంగం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో పలువురు రైతులు కలిసి సమస్య గురించి వివరించారు. ముఖ్యంగా పంట కాలువల్లో పూడిక తీయకపోవడంతో శివారు పంట పొలాలకు సాగునీరు అందడం లేదని తక్షణం పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. దరియాలతిప్ప వాటర్‌ట్యాంకు వద్ద తాగునీటి సమస్య పరిష్కరించాలని పరిపాలనాధికారికి వినతిపత్రం అందించామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే అశోక్ పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజుతో మాట్లాడి రైతాంగ సమస్యలను నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేతీరు అధికారులు కొనసాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుండెపోటుతో అయ్యప్ప భక్తుడి మృతి

ద్వారకాతిరుమల: అమలాపురం మండలం ఇందుపల్లికి చెందిన అయ్యప్ప దీక్షాధారుడు గుండెపోటుకు గురవ్వగా ఆస్పత్రికి తరలించే సమయంలో మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఈ ఘటన క్షేత్రంలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో చోటు చేసుకుంది. అమలాపురానికి చెందిన కొందరు అయ్యప్ప దీక్షాధారులు ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనార్థం రాత్రి ఆలయానికి వచ్చారు. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోకి వెళ్లేసరికి అప్పటికే సమయం ముగియడంతో సిబ్బంది రాజగోపుర ద్వారాలను మూసివేస్తున్నారు. అది చూసిన అయ్యప్ప దీక్షాధారుడు కె.సురేష్(27) స్వామివారి దర్శనం కోసం పరుగులు తీస్తూ గుండెపోటుకు గురై కుప్పకూలి పడిపోయాడు. అతని వెంట ఉన్న స్వాములు ఆలయ ఆవరణలోని ప్రథమ చికిత్సా కేంద్రానికి తరలించారు. చికిత్స అనంతరం దేవస్థానం అంబులెన్స్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించే క్రమంలో మార్గ మధ్యంలో మృతి చెందాడు.

ముగిసిన డ్రైవింగ్ పరీక్ష

యానాం: పుదుచ్చేరి అగ్నిమాపక శాఖలో డ్రైవర్ పోస్టులకు ఎంపికైన వారికి ఆదివారం డ్రైవింగ్ పరీక్షను నిర్వహించారు. ఇప్పటికే ఫిజికల్ టెస్ట్ ఉత్తీర్ణులైన యానాం, మాహే, కారైకల్ ప్రాంతాలకు చెందిన వారికి మెట్టయపాలెం గ్రౌండ్‌లో డ్రైవింగ్ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 45 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ అధికారి, అగ్నిమాపకదళ శాఖ జోనల్ అధికారులు పాల్గొన్నారు.

వైభవోపేతం..శాంతి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

అమలాపురం రూరల్: పవిత్ర కార్తికమాసం పురస్కరించుకొని పద్మావతీ అలమేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. శ్రీనివాస బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్లను కొలువు దీర్చారు. కారుపర్తి మల్లేశ్వరరావు శిష్య బృందం అర్చకత్వంలో కల్యాణం జరిపించగా వేలాది మంది భక్తులు తిలకించారు. కల్యాణకర్తలు స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోసి తరించారు. కల్యాణం అనంతరం శివ, గోవింద నామ స్మరణల మధ్య లక్ష దీపోత్సవం భక్తి శ్రద్ధలతో జరిపారు. తొలుత వినాయక పూజ, అభిషేకాలు నిర్వహించారు. లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తృతీయస్థానం సాధించిన బాలికల జట్టు

ఐ పోలవరం: చిత్తూరు జిల్లా అరకొండలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్–14 విభాగంలో సాఫ్ట్‌బాల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు కడప జిల్లాపై విజయం సాధించి తృతీయ స్థానంలో నిలిచినట్లు సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి ఏ నాగరామప్రసాద్, పీడీ కళావతి ఆదివారం తెలిపారు. విజయం సాధించిన జట్టులో ఐ పోలవరం మండలం జి వేమవరం ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు సభ్యులు ఉన్నారన్నారు. జట్టు సభ్యులతో పాటు కోచ్, మేనేజర్‌లను ఎస్ఎంసీ చైర్మన్ బసవ అప్పారావు, హెచ్ఎం సలాది వెంకట నారాయణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల అసోషియేషన్ కార్యవర్గం



ఎంపికైన నూతన కార్యవర్గం

ముమ్మిడివరం: ఇంజినీరింగ్ అసిస్టెంట్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ నియామకం జరిగింది. ముమ్మిడివరం అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కాకినాడ జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని నియమించారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ప్రెసిడెండ్‌గా కాలే సురేష్, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా మణికంఠ స్వామి, ప్రధాన కార్యదర్శిగా శాలెంరాజ్, కోశాధికారిగా శివరాం, మహిళా కార్యదర్శిగా సింధుశ్రీ,తో పాటు పలువురు సభ్యులను నియమించారు.

వేడుకగా సంఘీయుల వన సమారాధనలు

- ఆటపాటలతో అలరించిన చిన్నారులు
- పెద్దలకు సత్కారాలు
- సహపంక్తి భోజనాలు
- తాళ్లపాలెంలో హాజరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



తాళ్లరేవులో కాపు సంఘీయులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



యానాంలో కాపు కార్తిక వనసమారాధనకు హాజరైన ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే అశోక్

తాళ్లరేవు: కార్తికమాసం నాలుగో ఆదివారం సందర్భంగా మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్తిక వనసమారాధనలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. మండలకేంద్రం తాళ్లరేవు బైపాస్ రహదారిలోని గుండాబత్తుల శివరామమూర్తి స్థలంలో 23వ కాపు కార్తిక వనసమారాధన తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. మహిళలు ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాపు సోదరులు కుటుంబ సమేతంగా హాజరై ఉల్లాసంగా గడిపారు. చిన్నారులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కాపు నాయకులు, సంఘ పెద్దలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘీయులంతా ఐకమత్యంగా ఉండి సహాయ సహకారాలు అందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో తాళ్లరేవు తెలగ అభ్యుదయ సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన కోరంగి అభయారణ్యంలో సందర్శకులు వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు తరలి రావడంతో అభయారణ్యంలో సందడి నెలకొంది.

కాపు ఉద్యోగుల వనసమారాధన

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాపు ఉద్యోగుల సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఎదురుగా గల కర్రి సత్యనారాయణ రైస్ మిల్లు ప్రాంగణంలో కార్తిక వనసమారాధన ఆదివారం జరిగింది. ఈ వేడుకకు కోనసీమ వ్యాప్తంగా కాపు ఉద్యోగులు హాజరై సందడి చేశారు. తొలుత ప్రాంగణంలో గల ఉసిరి చెట్టుకు సేవాసమితి ప్రతినిధులు పూజలు చేశారు. సహపంక్తి భోజనాలు చేసి ఆత్మీయతను చాటారు. కాపు సామాజిక వర్గానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్, మాజీ కౌన్సిలర్ ఆశెట్ల ఆదిబాబు, రియల్ ఎస్టేట్, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్మెస్వీ ప్రసాద్ తదతరులను సేవా సమితి తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కాపు ఉద్యోగుల సేవాసమితి నూతన కార్యవర్గాన్ని సమితి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి జిల్లా అధ్యక్షునిగా నల్లా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సాధనాల ఏలేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా వలవల రాజు, గౌరవ సలహాదారులుగా పప్పుల శ్రీరామచంద్రమూర్తి, పోతంశెట్టి దొరబాబు ఎంపికయ్యారు.

విశ్వబ్రాహ్మణ కార్తిక వనసమారాధన

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో ఆ సంఘీయులు ఆత్మీయ వాతావరణంలో కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత సంఘ పెద్దలు ఉసిరి చెట్టు వద్ద కార్తిక పూజలు చేసి వన సమారాధనను ప్రారంభించారు. సంఘానికి చెందిన మహిళలు, పిల్లలు ఆట పాటలతో అలరించారు. అనంతరం సంఘీయులంతా సహపంక్తి భోజనాలు చేసి సందడి చేశారు.



అమలాపురంలో పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘీయులు

అగ్నికుల క్షత్రియుల కార్తిక వనసమారాధన

అమలాపురం టౌన్: అగ్నికుల క్షత్రియ సేవామిత్ర సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ స్థలంలో కార్తికవన సమారాధన ఆదివారం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. సంఘం అధ్యక్షుడు కొల్లు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో మహిళలు, చిన్నారులకు పలు పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు సంఘ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఈ వేడుకలకు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్, అమలాపురం తాలూకా సంఘం అధ్యక్షుడు డైరెక్టర్ లంకే భీమరాజు అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంఘం ప్రతినిధి చిప్పల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులంతా సంఘటితంగా ఉండి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొల్లు సత్యనారాయణమూర్తి, వైదాడి సత్యనారాయణ, సంకరపు ఆదినారాయణ, వీర్రాజు తదితరులు ప్రసంగించారు. సంఘీయులంతా సహపంక్తి భోజనాలు చేసి సందడి చేశారు.



అమలాపురంలో బహుమతులు అందజేస్తున్న అగ్నికుల క్షత్రియ సేవామిత్ర సంఘం ప్రతినిధులు

నేరెళ్లమ్మ సన్నిధిలో మంత్రి సుభాష్ పూజలు

తాళ్లరేవు: జాతీయ రహదారి216లో వేంచేసియున్న శ్రీ నేరెళ్లమ్మ ఆలయంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నక్కల చినపైడియ్య, శెట్టిబలిజ నవయుగ వెల్ఫేర్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన సమారాధనకు హాజరయ్యారు. పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది శెట్టిబలిజ సంఘీయులు హాజరై సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో నక్కల సుబ్బన్న, కాకి నాగేశ్వరరావు, రాయుడు గోవిందు, గుత్తుల ఈశ్వరరావు, పంపన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరంగిలో..

కాకతీయ కమ్మ కార్తిక వనసమారాధన కోరంగి పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల కోడూరి ఆదినారాయణ చౌదరి కొబ్బరితోటలో ఘనంగా జరిగింది. సంఘీయులు ఉత్సాహంగా ఆట పాటలతో సందడిగా గడిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కమ్మ సంఘం ప్రతినిధులు పాలడుగు సుబ్రహ్మణ్యం, వైడీ రామారావు, డా.జి.రామ్మోహన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఈలప్రోలు విష్ణువర్ధనరావు, సజ్జా గౌరీ శంకర్‌రావు, ప్రవీణ్, నాగేశ్వరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



కోరంగిలో కమ్మ సంఘం ప్రతినిధులకు సన్మానం

వైఖానస సంఘం ఆధ్వర్యంలో...

తాళ్లరేవు, కాజులూరు, యానాం ప్రాంతీయుల వైఖానస సంఘం ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద కార్తిక వనసమారాధన ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో తులసి ధాత్రి సహిత లక్ష్మీనారాయణ పూజా మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం రాకుదిటి సీతారామాచార్యులు, వేదాంతం నరసింహాచార్యులు దంపతులను ఘనంగా సత్కరించారు. సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధనలు

యానాం: కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం తెలగ కాపు అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన మహోత్సవం ఘనంగా జరిగింది. యానాం బైపాస్ రహదారిలో పెద్దిరెడ్డి వినాయకరావు కాపు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ఏపీ శాసనమండలి సభ్యుడు తోట త్రిమూర్తులు, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, అధ్యక్షుడు కాటంశెట్టి వెంకటరామ్మూర్తి, కార్యదర్శి చెక్కల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటలు, డ్యాన్స్ పోటీలను నిర్వహించగా అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లా వెంకన్న, గుండాబత్తుల ప్రసాద్ నాయుడు, బొంగరాల కేథార్నాథ్ పాల్గొన్నారు.

శెట్టిబలిజ కార్తిక వనసమారాధన

శెట్టిబలిజ కార్తిక వనసమారాధన యానాంలో ఘనంగా నిర్వహించారు. హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ శెట్టిబలిజలు ఐక్యతతో పనిచేయాలని కోరారు. అనంతరం మల్లాడిని శెట్టిబలిజ నాయకులు ఘనంగా సత్కరించారు. శెట్టిబలిజ నవయుగ వెల్ఫేర్ అసోషియేషన్ నక్కల చిన్న పైడియ్య ఆధ్వర్యంలో జరిగిన కార్తిక వనసమారాధనకు మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరయ్యారు.